# రాజయ్య ఇడ్లీ బండి

వంట మనిషి యాదమ్మ "కూతురుకి.. కానుపైందని ఓ 15 రోజులు రాలే''నని చెప్పింది! "సర్లేమ్మా" అని ఓ 1500 రూపాయలు ఇచ్చి పంపించాడు జగన్నాథరావు.

"డబ్బుకి ఇబ్బందిపడకు... ఏవన్నా అవసరమొస్తే కబురెట్టు"

"అలాగే అయ్యగారూ" దణ్ణంపెట్టి "మీకు ఎలా గడుస్తుందో ఏంటో, తప్పని స్థితిలో వెళ్తున్నాను"

"ఏం పర్లేదు- మనవణ్ణి ఎత్తుకో- మురిసిపో... తర్వాత రా!"

జగన్నాథరావు ఆత్మీయంగా మాట్లాడతాడు. తన దగ్గర పనిచేసే వాళ్లని ఆదరంగా చూసుకోవటం ఆయనకి వంశంతో వచ్చిన లక్షణం.

వందల ఎకరాల పొలంతోబాటు అతని తల్లిదండ్రులు వెలకట్టలేనంత మంచి హృదయం ఇచ్చారు.

నేడో రేపో పాతికేళ్ల 'పెళ్లి రోజు' జరుపుకుందామనుకుంటూండగా భార్య అన్నపూర్ణ కైలాసం వెళ్ళిపోయింది.

జమిందారుగారి భార్య... సాక్షాత్తూ అన్నపూర్ణమ్మ పోయారని ఊరంతా విలపించింది!

ఆయనకి ఎవరూ లేరు. ఏకాకిగా మిగిలిపోయారు.

'ఎవరూ లేకపోవడమేంటి మేమందరం లేమూ' అనుకుంది ఊరంతా.

కానీ ఆయన దగ్గరకెళ్లి 'బాబూ ఏటన్నా కావాల్నా?' అని అడగడానికి జగన్నాథరావు మామూలు మనిషి కాదు. కోటీశ్వరుడు- 'ఏం కావాలన్నా ఆయనే ఆర్డర్ చేయాలి... చేయించుకోవాలిగానీ మనం అడక్కూడదు' అనుకున్నారంతా.

యాదమ్మ ఆ ఇంట్లో పని మనిషి- అన్నపూర్ణ వెళ్లిపోగానే "బాబుగారూ- అమ్మగారి వంటలు నేను రుచి చూసాను. ఆవిడ పాళ్లూ... పాకం- మీ ఇష్టాలూ నాకు బాగా తెల్సు. మీరు సరే అంటే నేను వంట చేసి పెడతాను" అంది యాదమ్మ.

జగన్నాథరావుకి స్టవ్ వెలిగించడం కూడా రాదు! యాదమ్మకి పని మనిషి నుంచి వంట మనిషిగా ప్రమోషనిచ్చారు.

అవేళ్టినుంచి ఆమెని 'యాదమ్మ తల్లీ' అని పిలుస్తున్నారు.

ఇప్పుడు సెలవు పెట్టింది.

"ఇంకో వంటావిణ్ని చూడమంటారా" అన్నాడు పెద్ద పాలేరు రంగడు.

"వద్దురా... మనం ఓ రుచికి అలవాటుపడ్డాం! మళ్లీ కొత్తవాళ్లొస్తే మనకి ఏ కూర ఎలా వండితే ఇష్టమో చెప్పడానికి మనకావిద్య రాదు. ఏదో మంచి హోటల్నించి కారియర్ తెప్పించుకుందాం- పొద్దున్నే కాస్త టిఫిను- మధ్యాహ్నం పెరుగన్నం- రాత్రి చపాతి ఇలా అనుకున్నాన్రా- బైట చెత్త నూనెలూ, తుప్పు గిన్నెల్లో వండుతార్రా! అయినా మన యాదమ్మతల్లి ఏవేవో పచ్చళ్లు చేసి ఫ్రిజ్‌లో పెట్టిందట- ఏ రోజేం తినాలో లిస్టు రాసింది- మనకేం ప్రోబ్లం లేదు- నువ్వెళ్లి నీకు నాకూ ఇడ్లీలు కట్టించుకురా- వేడిగా ఉండాల్రోయ్!"

✦ ✦ ✦

"వార్నీ బావున్నాయిరా.. ఇడ్లీలూ- ఏ హోటల్నించి తెచ్చావ్"

"బాగున్నాయన్నారుగా హోటల్ అడక్కండి"

"మీ ఇంట్లో చేయించి తెచ్చావు కదా?" అన్నాడు జగన్నాథరావు.

"మీ మీదొట్టుగా మా ఇంట్లోవి కాదండీ- ఇదిగో మిగిలిన చిల్లర"

"ఎక్కడ కొన్నావ్"

"మన సందు చివర రాజయ్య ఇడ్లీ బండిమీద తెచ్చానండి. వాడు చాలా బాగా చేస్తాడని అందరూ అనుకుంటున్నారు" చెప్పడానికి ఇబ్బంది పడ్డాడు రంగడు.

"నిజంగా బావున్నాయిరా. రోజూ ఇవేతే- అవునూ నువ్వు తిన్నావా?"

"నాకు రాజయ్య ఫ్రీగా ఇచ్చాడయ్యా?"

"ఫ్రీగానా.. ఎందుకు? నా పేరు చెప్పావా?" కోపం వచ్చింది జగన్నాథరావుకి.

"లేదండి.. ఆయనకి ఓ పదిమందికి ఫ్రీగా పేకెట్ ఇవ్వడం అనవాయి తీటండి!"

"అరె చిత్రంగా ఉందే"

✦ ✦ ✦

జగన్నాథరావు మార్నింగ్ వాక్‌లా పొలానికి నడిచే వెళ్తాడు– రంగడు కూడా వస్తాడు. ఇది రోజూ జరిగే కథ– ఆ మర్నాడు ఓ పెద్ద గుంపుని చూశాడు జగన్నాథరావు. "ఏంట్రా అది రంగా... ఏదన్నా గొడవ అవుతోందా?"

"కాదయ్యా మన రాజయ్య ఇడ్లీ బండి" అన్నాడు రంగడు. జగన్నాథం ఆశ్చర్యపోయాడు.

"అది కాదురా.. దొమ్మీ జరిగినట్లు అంతమంది జనం ఏంట్రా?"

"రాజయ్య ఇడ్లీ అలాంటిది అయ్యా"

"నాక్కూడా ఆ దొమ్మీలో దూరి ఇడ్లీ కొనుక్కోవాలనుందిరా"

"నేను తెచ్చిపెడుతున్నాను కదయ్యా.. మీరక్కడికి వెళ్లకూడదు. ఎందుకు చెప్తున్నానో వినండి?"

"ఎందుకు వెళ్ళ కూడదురా?" జగన్నాథం అడిగాడు.

"మీలాంటి పెద్దోళ్లు వచ్చారంటే ఆయన కంగారుపడ్తారు– కస్టమర్లు కూడా పారిపోతారు. జమిందారుగారు స్వయంగా వచ్చారంటే ఆయన రేటు పెంచేస్తాడు. వద్దండీ పేదోళ్ల నోట్లో మట్టి కొట్టినవాళ్ళం అవుతాం మనం" రంగడు జగన్నాథరావుగారి ఉత్సాహాన్ని అణచి చెప్పాడు.

కానీ జగన్నాథరావుగారి ఉద్రేకాన్ని ఆపలేకపోయాడు.

✦ ✦ ✦

జగన్నాథరావు మామూలు బట్టల్తో దర్జాలూ ఆర్భాటాలూ లేకుండా ఓ తలపాగా చుట్టుకుని ఇడ్లీ బండి దగ్గరకి వెళ్లాడు.

జమీందారు జగన్నాథరావుని ఎవ్వరూ గుర్తుపట్టలేదు.

"ప్లేటు ఇడ్లీ కావాలి" అని అడిగాడు.

ఇడ్లీ బండి ఓనర్ రాజయ్య- "ఒక్క ఛణం ఆగలేవా ఈ వాయంతా వేరే పిల్లలకి ఇవ్వాలి" అన్నాడు.

జగన్నాథరావు చూస్తూనే ఉన్నాడు.

రాజయ్య ఇడ్లీ పొట్లాలుగా కట్టి వచ్చిన పిల్లలకి ఇస్తున్నాడు- వాళ్లెవళ్లూ డబ్బులు ఇవ్వట్లేదని గమనించాడు. నాలుగైదు పొట్లాలు ఫ్రీగానే వెళ్లిపోయినట్లు జగన్నాథరావు తెలుసుకున్నాడు.

తలపాగాలో ఉన్న జమీందారుగారు తన బండి దగ్గరకి వస్తాడని రాజయ్య ఎప్పుడూ ఊహించలేదు. అయినా ఆ జమీందారుగార్ని అతడెప్పుడూ ప్రత్యక్షంగా చూడలేదు.

ఎవరో కొత్త కస్టమర్ అనుకుని ఆ వాయి పిల్లలకే అని నిలబెట్టి రెండో వాయిలో జగన్నాథరావుకి ఇడ్లీ అందించాడు రాజయ్య.

అక్కడ తింటే వేడి వేడిగా ఇడ్లీ ఇంకా బాగుంది. అన్నపూర్ణ చేసినట్టుంది. యాదమ్మ చేతి వంటలా వుంది. రాజయ్య పరిశుభ్రంగానే ఇడ్లీలు చేస్తున్నాడు. తినదల్చుకున్న దానికన్నా రెండిడ్లీలు ఎక్కువే తిన్నాడు. వేడి వేడిగా బండి ముందే ఇడ్లీలు తింటుంటే ఎంత ఆనందంగా ఉందో, రాజయ్య ఇడ్లీ బండిని తన ఇంటి ముందు పెట్టెయ్యమంటే ఎంత

బాగుంటుంది.

నెమ్మదిగా రాజయ్యని కబుర్లలోకి దింపాడు.

"ఇందాక పిల్లలకి ఇడ్లీ ప్యాకెట్లు ఫ్రీగా ఇచ్చావ్ దేనికి?"

"నీకెందుకయ్యా నీక్కూడా ఫ్రీగా కావాలా? వాళ్లు నాలా పెరుగుతున్న పిల్లలు. అమ్మ నాన్న లేనప్పుడు నేను అర ఇడ్లీ కోసం నానా అవస్థలు పడ్డాను. ఇవ్వాళ నేను ఎంచుకున్న పనివల్ల అనాథ పిల్లలు కనిపిస్తే వాళ్లకివ్వడానికి నా బండి మీద కొన్ని పొట్లాలు రడీగా ఉంటాయి. నేను పెద్దగా దానధర్మాలు చేయలేనుగానీ చిన్నప్పటి నాకు, నేనే టిఫిన్ పెట్టుకున్న ఆనందం నాకు కలుగుతుంది" అన్నాడు రాజయ్య.

జగన్నాథరావు కళ్ళల్లో నీళ్లు తిరిగాయ్.

"వెళ్ళొస్తానయ్యా" అని వెనక్కి తిరగబోతుంటే... రాజయ్య

"మీరెవరోగానీ డబ్బులియ్యకపోతే నేనొప్పుకోను. మాట్లాడుతూ మాట్లాడుతూ ఆరు ఇడ్లీలు తిన్నారు. మీలాంటి వాళ్లిస్తే కదా స్వామీ- నేను, మా పిల్లలు తినగలం. మీకు ఫ్రీగా ఇడ్లీ ఇవ్వలేను. ఆరు రూపాయలిస్తారా?" అన్నాడు రాజయ్య.

ఆరు వందల రూపాయలు అతని చేతిలో పెట్టి "వందమందికి ఇడ్లీలు పంచవయ్యా" అంటూ జగన్నాథరావు కదిలిపోయాడు.

ఆయనెవరో రాజయ్యకి తెలీదు కానీ మర్నాడు రంగడు అయ్యగార్కి టిఫిన్ కొనడానికొచ్చినప్పుడు "ఈరోజు నా బండి దగ్గరకొచ్చిన వాళ్ళందరికీ ఇడ్లీ ఫ్రీ అయ్యా. ఎవడో పెద్ద మనిషి నిన్న వచ్చి ఆరొందలిచ్చి వందమందికి ఇడ్లీలు ఫ్రీగా ఇమ్మన్నాడు. డబ్బొద్దు- పట్టుకుపో" అన్నాడు రాజయ్య.

ఆ విషయం విని జగన్నాథరావు ఆశ్చర్యపోయాడు.